
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం, 10 ఆగస్టు 2024
www.prajaaswaramdaily.com
2 PM

# వయనాడ్‌లో మోదీ ఏరియల్ సర్వే




హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : ప్రకృతి విపత్తు కారణంగా అతలాకుతలం అయిన కేరళలోని వయనాడ్ లో ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటిస్తున్నారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్ మల తదితర ప్రాంతాల్లో మోడీ శనివారం ఎయిరియేల్ సర్వే నిర్వహించారు. ఇవాళ ఉదయం 11 గంటలకు కన్నూర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కు చేరుకున్న మోడీకి అక్కడ కేరళ గేవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, సీఎం పినరయి విజయన్ స్వాగతం పలికారు. అనంతరం వీరుతో పాటు కేంద్ర మంత్రి సురేశ్ గోపీతో కలిసి ప్రధాని ఎయిర్ ఫోర్స్ హెలికాఫ్టర్ లో వయనాడ్ వెళ్లారు. అక్కడ కొండచరియలు విరిగిపడిన గ్రామాలు విధ్వంసమైన ప్రాంతంలో పీఎం మోడీ ఏరియల్ సర్వే చేశారు. అనంతరం కాల్ పెట్టలో హెలికాఫ్టర్ దిగిన తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ టీమ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకోనున్నారు. అలాగే సహాయక శిబిరాలు, ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించనున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

## తెలంగాణకు కొత్త రైలు మార్గం.. మోదీ సంకల్పానికి సాక్ష్యం

### కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : తెలంగాణ మీదుగా కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ నిర్ణయం రైల్వే నెట్ వర్క్ ను పటిష్టం చేసే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి సాక్ష్యం అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఎనిమిది కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు నిన్న ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో జరిగిన సెంట్రల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంపై శనివారం బండి సంజయ్ ఎక్స్ వేదికగా రియాక్ట్ అయ్యారు. రూ. 24,657 కోట్ల అంచనా వ్యయంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్ లో ఈ కొత్త రైలు మార్గాలు ఏర్పాటు చేయనున్నారని అందులో భాగంగా ఒడిశా లోని మల్కాన్ గిరి నుంచి భద్రాచలం మీదిగా పాండురంగాపురం వరకు రూ. 4,109 కోట్లతో 200.60 కిలోమీట్ల పొడువైన కొత్త లైన్ నిర్మించబోతున్నారని పేర్కొన్నారు.

## 3 లక్షల ఇళ్లు : కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : తెలంగాణ కేంద్రం మూడు లక్షల ఇళ్లు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పిలుపులో భాగంగా శనివారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మొక్క నాటారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నాటి కేబినెట్ భేటీలో ఇళ్ల మంజూరుపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కేంద్రం ఇళ్లు మంజూరు చేసినా కేసీఆర్ తీసుకోలేదని అన్నారు. తెలంగాణకు నూతన అధ్యక్షుడి విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపైనా కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. బీఆర్ఎస్ విలీనంపై మా పార్టీలో ఎటువంటి సంప్రదింపులు లేవని, మీడియా ఛానళ్లు తమపై అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

## తెలంగాణకు కొత్త ఎయిర్‌పోర్టులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చంద్రబాబు హయాంలోనే బీజం పడిందని అన్నారు. అప్పుడు ఇంత భూమి ఎందుకు కేటాయించారని విమర్శలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు దూర దృష్టితోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని అన్నారు. తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. విమానాశ్రయాల భద్రతలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాని మోడీ పిలుపునిచ్చిన ప్రకారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఏవియేషన్ సెక్యూరిటీ కల్చరల్ వీక్‌లో భాగంగా 10కే రన్ నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు.

## పంచాయతీ పోరుకు డేట్ ఫిక్స్!




### సెప్టెంబర్ 21, 25, 30 తేదీలు ఖరారు

పాలకవర్గాల కాలపరిమితి ముగిసి ఆరు నెలలు

ప్రత్యేకాధికారుల పాలనలో మందగించిన అభివృద్ధికి

పాత బిల్లుల కోసం మాజీ నుంచి ఒత్తిడి

హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి ముగిసి ఆరు నెలలు దాటడంతో ఇక ఆలస్యం చేయకూడదని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలను రాష్ట్రంలో మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు దాదాపుగా సెప్టెంబర్ 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది. అధికారులు ఎన్నికలు నిర్వహించే తేదీలు, ఓటర్ల జాబితా ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చేసరికి పంచాయతీ ఎన్నికల నిర్వహణ అంశం కొలిక్కి వస్తుందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రాగానే ఆయన ఆదేశాలతో ఎన్నికలకు నగరా మోగనుంది. సెప్టెంబర్ నెలలో ఎన్నికలకు వెళ్లేందుకు సాధ్యాసాధ్యాలపై పంచాయతీరాజ్ శాఖ అధ్యనం చేస్తోంది.

### ఆరు నెలలుగా ప్రత్యేక పాలన

ఇప్పటికే గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 2న ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రవేశ పెట్టింది. నాటి నుంచి నేటి వరకు గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఆగస్టు నెల చివరి వరకు మూడో విడత రుణమాఫీ ముగుస్తుండడంతో గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ నేతలు పలుమార్లు సర్పంచ్ ఎన్నికలపై సమావేశం అయ్యారు. మాజీలుగా మారిన సర్పంచ్‌లు రోడ్డెక్కారు.తమ హయాంలో అప్పులు చేసి పనులు చేశామని, బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సచివాలయం ముట్టడికి యత్నించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి అనంతరం కొత్త పాలకవర్గాలు కొలువుదీరితే ఆర్థిక సంఘం నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్రం నుంచి వచ్చే నిధులతో సర్పంచ్‌లకు ఉన్న బకాయిలు చెల్లించడం ద్వారా సమస్య నుంచి బయటపడవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఎన్నికలు వీలైనంత వేగంగా సెప్టెంబర్ 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ వర్గాల సమాచారం.

## తెలంగాణలో పెట్టుబడికి బొయిటిస్ గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతోంది. శనివారం ఉదయం ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థ బొయిటిస్ ప్రతినిధులతో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. చర్చల అనంతరం హైదరాబాద్‌లో కేపబులిటీ సెంటర్‌ను విస్తరించాలని బోయిటిస్ నిర్ణయం తీసుకున్నది. వచ్చే సెప్టెంబర్ నుంచే కార్యకలాపాలు ప్రారంభించాలని ఒప్పందానికి వచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తమ బొయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలు ముందుకురావాలి

### మందకృష్ణ మాదిగ

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ప్రజాస్వరం) : ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలే చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందునా డిమాండ్ ఉన్న రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ అమలు పరిచేలా ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచన చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరినట్లు చెప్పారు. తన విజ్ఞప్తిపై ప్రధాని సానుకూలంగా స్పందించి నిర్దిష్టమైన హామీ ఇచ్చారని వెల్లడించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మందకృష్ణ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఉందని, వర్గీకరణ సాకారంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి పాత్ర ఎంతో ఉందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రాలు వేగంగా ముందుకు రావాలన్నారు. వర్గీకరణకు సమర్థిస్తూ తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి న్యాయమూర్తికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదన్నారు.

## మల్లారెడ్డి కాలేజీలో రణరంగం..



మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

ఫర్నిచర్ ధ్వంసం చేసి నిప్పు పెట్టిన స్టూడెంట్స్

### విద్యార్థి సంఘాల మద్దతు

మేడ్చల్, ఆగస్టు 10 (ప్రజాస్వరం) మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో హార్ట్ ఎటాక్ తో మృతిచెందిన విద్యార్థికి న్యాయం చేయాలని, కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. వందలాది మంది విద్యార్థులు కళాశాల ముందు ఆందోళన దిగారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫర్నిచర్ ను ధ్వంసం చేసి నిప్పంటించారు. విద్యార్థుల ఆందోళనకు ఏబీవీపీ, ఎన్ ఎస్ యూఐ విద్యార్థి సంఘాలు మద్దతు తెలపడంతో ఆందోళన తారా స్థాయికి చేరింది. పోలీసులు జోక్యం చేసుకున్నప్పటికీ విద్యార్థులు వెనక్కి తగ్గలేదు. చివరకు మల్లారెడ్డి కొడుకు మహేందర్ రెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి దిగివచ్చి విద్యార్థుల సమస్యలన్నిటి పరిష్కరిస్తామని, మృతి చెందిన విద్యార్థి అరుణ్ కుమార్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

### అసలు ఏం జరిగిందంటే..

మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్న అరుణ్ కుమార్ అనే విద్యార్థి మొన్న తరగతి గదిలోనే హార్ట్ ఎటాక్ తో మృతి చెందాడు. ఆయన మృతికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సకాలంలో అంబులెన్స్ అరెంజ్ చేయకపోవడం వల్ల విద్యార్థి మృతి చెందాడని విద్యార్థులు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. అంబులెన్స్ ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు.

### సౌకర్యాలు కల్పిస్తాం : ప్రీతిరెడ్డి

విద్యార్థుల డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని, ముఖ్యంగా అన్ని క్యాంపస్లకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రీతిరెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు హెల్త్ చెకప్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

